

# ప్రేమ అంటే?

"వాహిని"

శాంతకి ప్రేమలో నమ్మకం లేదు. "ఈ ప్రపంచంలో ప్రేమ అనేది లేదు. అంతా మిధ్య. ప్రేమ అనేది ఎన్నో నీచమైన గుణాలకి అడ్డంగా నిలబడుతూ ఈ ప్రపంచంలో ఒక మానవుడిని మరొక మానవుడు మోసం చేయడానికి తగినంత వీలును కల్పిస్తూ ప్రేమలోని దేవత్వాన్నీ మానవుల్లో దానికుండవలసిన విశిష్టమైన స్థానాన్నీ పోగొట్టు కుంటూంది. లేకపోతే నిజమైన ప్రేమ ఎక్కడుంది? హృదయపూర్వకంగా ప్రేమించడం అనేది నేటి మానవులకి అతీతం. నేటి మానవుల్లో హృదయమనేది అరుదు పవిత్ర ప్రేమ అనే నామాన్ని ఉచ్చరించడానికి కూడా తగరు వీళ్లు. అటువంటప్పుడు "పవిత్రప్రేమ" ప్రేమించడం అంటూ ప్రపంచాన్ని మోసం చెయ్యడం ఎందుకు? తమనితాము మోసగించుకోవడం ఎందుకు?" అని చాలసార్లు ఆమె తన అక్క శ్యామలతో దెబ్బలాడింది శ్యామలకి సాహిత్యంలో నమ్మకముంది. జీవితంలో కూడా ఆమె ప్రేమను నమ్మవలసిన పరిస్థితి వచ్చింది. అందుచేత ఆ గట్టి నమ్మకంతో శాంతమీద ఒకతర్కం ప్రయోగించ దలచింది. కాని శాంతది కొంచెం దురుసు తనం. అందుచేత శ్యామల సాధారణంగా గెలిచేది కాదు.

శ్యామల గెలవపోయే సమయాలు లేకపోలేదు, కాని శాంత ముఖాన్ని అదోలా పెట్టి 'ఏడిశావ్' "నీముఖం' ఉత్యాది పదాలు ప్రయోగించేది పైగా ఉద్రేకంలో శ్యామల "ప్రియు" డైన రామారావు పేరు కూడా ఎత్తేది తనలో నిజానికి అవినీతి అణుమాత్రమూ లేకపోయినా శాంత దురుసు తనంలో ఇంకా అన్ని విషయాలూ బయటపడేస్తుందేమో, తన కథ అందరికీ వెల్లడి అయిపోతుందేమో అని అయినా శ్యామల ఊరుకోక తప్పింది గాదు "నీలోఇంత బలహీనత వుంది. నీ ప్రేమ 'పవిత్రప్రేమ"కాదు. అంత చెప్పుకోదగ్గ లోటుంటేనే గాని నువ్విట్లా నీ ప్రియుణ్ణి తలవగానే ఇంత సిగ్గు పడవు. కాబట్టి నువ్విప్పుడు నీలో వున్న ప్రేమకిస్తున్న పేరు—పవిత్ర ప్రేమ అని—సరైనదికాదు" అన్నది, శాంత శ్యామల కొంచెం వాదించదలచి "—కాదు నేను నీకు నెమ్మదిగా అంతాచెప్తాను కాని నువు చెప్పేదంతా అబద్ధం అన్నది. శాంత వెటకారంగా నవ్వి 'నీ మొహం' అన్నది

శాంత ఇంకా కాలేజీలో చదువుకుంటోంది. ఎప్పుడయినా అలా పోస్టాఫీసుకువెళ్ళి రామారావుకి రాయడానికి కార్డో కవరో తెమ్మనిశ్యామల చెప్తే "ఎందుకక్కా అతనంటే అంత యిది. అతను ప్రెడిషనల్ ప్రియుడుకాదని నీకిదివరకు చాలసార్లు చెప్పాను ప్రేమ అనేది, ఇంతకీ అది

ప్రపంచంలో ఉంటే-రెండుప్రక్కల్నుంచీ వొస్తే సక్సెస్గాని లేకపోతే నిరర్థకమేగా! అతడునిన్ను నువ్వనుకునేటంతలా 'ప్రేమిస్తున్నాడనుకోడంలో నువు ఒక అర్థంలేని ఆత్మవంచనలో పడిపోతున్నావు" అన్నది శాంత. "కాని తన ప్రియుడు తనని ప్రేమిస్తున్నాడో లేదో ప్రేయసికి, తన భర్త తనని ప్రేమిస్తున్నాడో లేదో భార్యకి, తెలిసినంత బాగా భావదాస్యంవల్ల దెబ్బతినే ఇతరులకి ఎప్పుడు తెలియదు" అన్నది శ్యామల నవ్వి.

శాంతకి ప్రేమమీదవున్న యీ ద్వేషం కేవలం పురుషప్రేమ ద్వేషమే, ఎందుకంటేశ్యామల రామారావుని 'గాఢంగా ప్రేమిస్తున్నట్లు" ఆమెకు నమ్మకంగా తెలుసు. దాంతో స్త్రీ ప్రేమించగలదు అని ఆమెకు ఒక గట్టి నమ్మకం ఏర్పడ్డది. ఈ విధమైన "హృదయపూర్వకమైనప్రేమ ఆమెకు రామారావులో కనిపించలేదు. ఫలితంగా అతని "ప్రేమ" వట్టి డంబమని ఆమె అనుకుంటూంది. ఇది అతి త్వరలో యావత్పురుష ప్రేమ ద్వేషక్రిందికి మారింది.

ఒకనాడు ఈ నమ్మకాల గురించి మామూలుగా ఒక వాదన జరిగింది. అందులో శాంత అడిగింది. "ఇంతగా ప్రగల్భాలు పలుకుతున్నావు. గదా. రామారావుని నువు పెళ్లి చేసుకోగలవా?"

"నేనేమంత చాతకాని దాన్ననుకున్నావా?. అవునులే. ఇది సహజమే, నువ్వసలు ఏదో ఒక అర్థంలేని సిద్ధాంతంలోపడిపోయావు, అందులో నీ నమ్మకం జాస్తి కావడంవల్ల నువు నీ మనస్సుకి లొంగి పోయావు. అంటే నువు చాతకాని దానిపై పోయావు. అందరూ చాతకాని వాళ్లే అనుకొంటున్నావ్'' అన్నది శ్యామల. విజయసూచకంగా నవ్వుతూ,

ఆ విధమైన నవ్వుని శాంత సహించలేదు. "నీమోహం " అన్నది వెటకారంగా,

"నా మోహంకాదు నీమోహం' అన్నది శ్యామల నవ్వుతూనే.

ఆ నవ్వు కొంది కాలంలోనే సార్థకమైపోయింది. రామారావుతోనే శ్యామలకి వివాహమైంది.

"దైవికంగా నీ కిట్లా కలిసొచ్చింది గాని నువు నీ "చేతనైన తనాన్ని' చూపించి నీ ప్రేమ నీ కోశక్తి ప్రసాదించిందని ఋజువు చెయ్యలేదు. ప్రేమకి విజయం లభించినప్పుడు. ఆ కీర్తిని తాము తీసుకునీ ప్రేమ విఫలమైనప్పుడు ఆ పాపాన్ని దైవం మీద తోసేసి సదా మానవులు తమ భార రహితయానాన్ని చూసుకుని సంతోషించుకుంటున్నారు. అంతేకాని వాస్తవంగా మానవుడికి గాని ఎంత మాత్రమూ "శక్తి' లేదు. నువు నవ్వతే నవ్వుగాని దాల్లోకి విజయ గర్వం మాత్రం రానియ్యకు!" అన్నది శాంత.

"సరేలే నా ప్రేమ విజయం పొందినందుకు సంతోషించవలసిన నేను నా శక్తి చూపించడానికి ఆధారం దొరకలేదు గదా అని విచారిస్తున్నాను. కాని నీకు నేనిప్పుడు చెప్పవలసిందొకటుంది. నీకు స్వాభావికంగా మానవశక్తి మీద ఒక అపనమ్మకం మొలిచింది. ఆ అపనమ్మకంవల్ల నువు మానవుని చూడవలసిన దృక్పథం సంకుచితమై పోతూంది, అందుచేత నువు నా శక్తిని కూడా అనుమానిస్తున్నావు—కాని నువు ఏ నాడైనా దేవుడి ధర్మమా అని ప్రేమలో పడితే నీకీ విషయంలోని నిగూఢ సత్యం గోచరిస్తుంది. అన్నది శ్యామల.

"ఆ-మధ్య దేవుడేవడు!'

"-నిన్నూ నన్నూ మన పూర్వుల్నీ మన తరవాతి వాళ్ళని ఓ దార్లో పెట్టే అధికారి"

శాంత "నేను నమ్మను" అని చెపుదామనుకున్నది. చెప్ప లేదు. కాని చెప్పినట్టుగానే తల వూపింది. అయితే, శ్యామల మాటల్ని బాగా

ర్గం చేసుకోవడంవల్ల ఆమె ముఖం ఒక ంభీర భావాన్ని వ్యక్తం చేస్తున్నది.

శ్యామల ఇంకా ఇలా అంది "ఆలోచించు -ప్పటికైనా నువ్వు ఈ మాటలు నిజమే నక్కా- అంటూ వొస్తావు దార్లోకి. కేవలం అనుభవం కావాలి నీకు, అంతే"

శాంత వెటకారంగా నవ్వింది

*   *   *

కాలేజీ విద్యార్థినికి, అప్పుడప్పుడు యాదాలా పంగానో, ఆకస్మికంగానో ఎదురుపడే విద్యార్థిని అనగా సహాధ్యాయిని అమె ఎలా చూస్తుందో అంతకంటె ఏ విధమైన ప్రత్యేకతా యివ్వకుం డానే శాంత విశ్వేశ్వరరావుని చూసింది. చాల సార్లు, కాని పల్లెటూళ్లో శాంత మేనత్తకొడుకు వివాహం అవుతూంది, అతను కూడా వచ్చాడు. రెండుమూడుసార్లు చూడగానే అతను తనక్లాసే చదువుతున్నాడని జ్ఞాకం తెచ్చుకున్నది. బహుశా ఆడపెళ్ళి వారి బంధువై యుంటాడనుకున్నది

పెళ్ళి అవుతున్న ఇంట్లోనే మేడ అంతా విడిదిగా యిచ్చారు. శాంతకి తక్కిన ఆడవాళ్ళతో బాతాఖానీ కొట్టడం ఇష్టం లేదు. వరండామీదనో ఎక్కడో స్తబ్దుగా ఉంటోంది. కిందకి కూడా దిగటంలేదు. నిత్యమూ మేడమెట్లు ఎవరో ఒకరు ఎక్కడంవల్ల లేక దిగడంవల్ల గడ బిడగా వున్నాయి. శాంత అక్కడ నిలబడి కొంతసేపు గడిపేది.

విశ్వేశ్వరరావు మాత్రం అది అందించటాని కనీ, దీనికి పిలవడానికనీ, అది తనుక్కూడికనీ, ఇది చెప్పడానికనీ ఎన్నోసార్లు మేడ ఎక్కు తున్నాడు. ఇది శాంత గమనించి అతను తన కోసమే వస్తున్నాడా అని కూడా అను మానిం చింది కొన్నిసార్లు.

కాని అతను మేడ ఎక్కడానికి ఇతర కార ణాలు కూడా ఉన్నవని అమె గుర్తించింది. అతను ఎవరెవరో పెద్దమనుషులకి ఏవేవో సమాధానాలు చెప్తూన్న సమయాల్లో మధ్య ఎద్య ఆలోచిస్తూన్నప్పుడు దిక్కులు చూడగా కనపడిన తనకేసి భావరహితంగానే చూసిన అతని చూపు లకి తాను అంతకన్నా భావరహితంగా సమాధానా లిచ్చింది.

లగ్నం నాటి రాత్రి అనగా సాయంత్రం మూడున్నరా నాలుగవుతుంది మేడమీద పిట్ట గోడని ఆనుకొనివున్న శాంతని చూసి అలా పోతున్న విశ్వేశ్వర్రావు 'మిమ్మల్నెక్కడో చూసి నట్టుంది.' అని పలకరించబోయాడు, కాని శాంత విముఖంగా "చూడవచ్చు" అనేసి టన వాళ్ళమధ్య దాంకోడానికి వెళ్ళి పోయింది,

అలా దాంకుని ఉన్నప్పటికీ అమె మనసులో అతనింకా ఉన్నాడు. అతను తన గురించి ఏమను కుంటాడో - ఏమనుకుంటేనేం? చొర వగా అపరిచితులతో, అందులో స్త్రీలతో మాటాడే పురుషుడికి ఎలాంటి పరాభవం జరగ డానికి కవకాశం ఉందో అలాంటి పరాభవమే తనకీ కలిగిందని సమర్థించుకొని ఊరుకుంటాడు, బహుశా-

మర్నాడు మధ్యాహ్నం భోజనాల వేళప్పుడు అందరూ భోజనాలకని వెళ్ళిపోయినా శాంత వెళ్ళి పోలేదు. అమెకు ఆకలివెయ్యడంలేదు. తల్లితో తిందామని ఉండిపోయింది. ఆవిడ పెరట్లో స్నానం చేస్తూంది-

అజాగ్రత్తగా తెంచి వుంచిన తలుపుల్ని వేసేస్తూ విశ్వేశ్వర్రావు శాంత వున్న గదికి కూడా వచ్చాడు. గదిలో ఎవరో ఉన్నారని తెలియగానే వెళ్లిపోబోతూ "అరె! మీరు భోజ నానికి వెళ్ళలేదేం?" అన్నాడు, ఆలా అని వెళ్ళి పోబోతున్నవాడల్లా నిలబడిపోయాడు.

శాంత ఒక్కనిమిషం మాత్రం ఆలోచిం చింది. ఎంత అపరిచిత పురుషుడైనా వాళ్లింటికి

తానువచ్చింది. మ టాడినంతమాత్రంలో తప్పేం లేద. ఇలా అనుకుని నిదానంగా, తామూ తల్లీ రెండవపంక్తిలో భోజనం చేయబోతున్నట్లూ అందుకు ముఖ్యకారణం తనకి ఆకలి లేదు అనీ చెప్పింది.

'విజయనగరం కాలేజీలో మిమ్మల్నెక్కడో చూసినట్టు జ్ఞాపకం. మీరుగాని చదువుతున్నారా" అన్నాడు విశ్వేశ్వర్రావు.

"చదవొచ్చు" అని శాంత నవ్వింది. "నేను మీ క్లాసే చదువుతున్నట్టు మీకు జ్ఞాపకం లేదని మీరనబోతున్నారంటే మిమ్మల్ని మీరే వంచించు కుంటున్నారన్న మాట ఒప్పుకుంటారా?" ఆమాట లన్నీ ముందు ఏమాత్రమూ తయారుకాకుండా అలవాటు చొప్పున కేవలం అనగలిగేవిమాత్రమే.

"చప్పనావుద్దేశం అదికాదు. మనుషుల్ని పోలిన మనుషులుంటారని నా దృఢ నమ్మకం ఒకవేళ మీ లాంటి వాళ్ళనెవరైనా చూసి మీ రనుకున్నానేమో" అని అన్నాడు అతను.

కాసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది.

శాంతకి కొంచెం ధైర్యం వచ్చింది. పెళ్ళి కూతురు మీ చెల్లెలా? అని అడిగింది.

"అలాగయినా బాగుండిపోను. అయినా యిందులో మీ తప్పేంలేదు. అన్నిపనులూ నెత్తిన వేసుకున్నాను. కాని పెళ్ళిపెద్ద నా మేనమామ అతనికి కొడుకుల్లేరు."

శాంతకి నవ్వువచ్చింది. "బాగున్నాది పెళ్ళి కూతురు మీకు మేనమామ కూతురు పెళ్ళి కొడుకు నా మేనత్త కొడుకు!"

విశ్వేశ్వర్రావు తనకి శాంత ఏమౌతుందో లెక్కకట్టాడు.

శాంత కూడా అ ఎని చేసింది అప్రయ త్నంగా అదయ్యాక "సరేగాని ఏమీ తోసు పోడంలేదు. మీకైనా పుస్తకాలుతెస్తేయిద్దురూ" అన్నది.

విశ్వేర్వర్రావు నవ్వాడు.... నేనిక్కడికి చదివిందికి రాలేదు... అయినా మీకు కావాలంటే ఏవైనా కథలపుస్తకాలూ నవల్సూ యివ్వగలను ఇదుగో అన్నట్టు గ్రామఫోనూ రికార్డులు వేసు కుంటారా?"

"అంతకంటేనా?"

విశ్వేశ్వర్రావు వెళ్ళిపోయాడు. మరునిమిషంలో శ్యామల వచ్చింది. "ఆ వెళ్తున్న బ్బాయి యెవరే?" అన్నది.

"ఏమో నాకేం తెలుసునూ — భోజనానికి వెళ్ళలే దేమని అడిగాడు. అమ్మతో తింటానని చెప్పాను వెళ్ళిపోయేడు" అన్నది శాంత సీరియస్‌గా

శాంత సీరియస్‌గా ఎప్పుడెప్పు డుంటుందో శ్యామలకి చాలా బాగా తెలుసును. అందుచేత నవ్వి "ఆహాఁ ఆలాగా?" అని, 'ఇంతేనా, ఇంతకన్నా ఏం జరగలేదూ?' అన్నట్టు చూసింది.

శాంతకి ఆ చూపు అర్థమైపోయింది, దాంతో కొంప లంటుకున్నాయి. "నాకు తెలుసు. ఇంతకంటె ఏమిటో విశేషం జరిగుంటుందని నువ్వనుకుంటున్నావు." అనాలని బుద్ధి పుట్టింది. అనేసింది గంభీరంగా,

శ్యామల మరీ నవ్వింది. "పుచ్చకాయల దొంగా, ఎందుకే భుజాలు తడుముకుంటావ్?"

శాంత మాటాడలేదు, ఉదాసీనంగా అటు తిరిగి కూర్చుంది. శ్యామల నవ్వుతోందని తెలుసు. అందుచేతనే మాటాడలేకపోయింది. అలాగే, ఇంచుమించు మౌనంగానే మధ్యాన్నం మూడింటిదాకా వుంది.

మూడు గంటలప్పుడు విశ్వేశ్వరరావు గ్రామఫోనూ రికార్డులూ ఏవో పుస్తకాలు మోయించుకుని వచ్చాడు. శ్యామల అడ్డుపడి ఈ గదిలో చోటులేదని చెప్పబోయింది. కాని ఇంతలోనే శాంత వచ్చి "పక్కకి తప్పుకో, నేను తెమ్మని చెప్పాను," అన్నది, కాని ఇందాక తను పలికి

మాటలకీ వీటకీ ఎంతో వైవిధ్యం ఉన్నట్టూ, తన్మూలంగా తాను ఓడిపోతున్నదనీ ఆమెకు స్ఫురించింది. కాని చిరకాలంనించీ ఆమెలో ఒక మొండిధైర్యం వుంది. అదే ఇప్పుడామెను కాసింది.

విశ్వేశ్వర్రావు వెళ్లిపోయాక శ్యామల ఒక నిట్టూర్పు విడిచి నవ్వింది, "అమ్మయ్య! ఇంత గ్రంధం ఉందీ? ఏమీ జరగడం లేదని భ్రమ పడ్డాను," అన్నది.

శాంత ఊరుకుందామనుకుంది. కాని ఆమెలోని మొండిధైర్యం "ఇక ముందు పడకు" అని గంభీరంగా అనిపించింది.

"ఆమాట నువు నాకు చెప్పక్కర్లేదు. సృష్టి చేసినప్పుడే, భగవంతుడు కొన్ని ప్రకృతి సిద్ధాంతాల్ని చేశాడు. బండికి నాటుదారిలోని గాట్లు ఎలాటివో మనుషులకి జీవితంలో అవి అలాటివి" అన్నది శ్యామల. శాంత లోపల్లో పల మండిపోయింది.

* * *

దినదినమూ శాంతకు ఒక క్రొత్త అభిరుచి పెరుగుతున్నది. కాని ఎవరికీ అది తెలియకుండా ఉండాలని అనుకుంటూ ఆమె పూర్వం లాగ దురుసుగానే ఉంటున్నది. కాని ప్రకృతి గుణం వేరు; తెచ్చిపెట్టుకున్నది వేరు. ప్రకృతి గుణంలోవున్న తీవ్రత తెచ్చిపెట్టుకున్నదానిలో ఉండదు; ఇందులోవున్న తీవ్రతకూడా ఒక్కొక్కప్పుడు అందులో వుండదు. అందుచేత ఇప్పటి దురుసుతనానికీ మునపటి దురుసుతనానికీ చాలా భేదం వచ్చేసింది. ఈ దురుసుతనం బాగా పెరిగిపోయి, దగ్గరికివెళ్తే కరుస్తుందా అన్నంత తీవ్రంగా ఉంది. ఊళ్లోనే వున్న శ్యామలకి ఈమాత్రం తెలియకపోలేదు. పరిహసిస్తూ వచ్చింది. దానికి శాంత మరీ ఉడుక్కునేది.

ఒకసారి శ్యామల తమ యింటికి ఏదో పని మీద వచ్చింది. అప్పటికి శాంత విశ్వేశ్వర్రావును సాగనంపుతున్నది. "రేపు మధ్యాన్నం రావడం మరిచిపోకండి." అని చెప్తున్నది.

శ్యామల ఇంట్లో అడుగుపెడుతూ "అయితే భయంలేదు. ప్రపంచం నడవవలిసిన దార్లోనే నడుస్తోంది. తప్పుదారంట నడవలేదు." అన్నది మందహాసంతో.

"ఈ వార్త చెప్పడాని కేలావుంది, ఇంత దూరం రావడం. అయితే ఆ గోడకి చెప్పేయ్. నాన్న అమ్మా యింటోలేరు." అన్నది శాంత గంభీరంగా.

"తెలుస్తూనే వుందిలే. అంతా తెలుస్తోంది."

వెళ్ళిపోయే ముందటివరకూ శామ్యల ఈ విషయమై ఒట్టే ఏం మాట్లాడలేదు. అప్పుడు ఇలా అన్నది "ప్రేమ అంటే ఏమీ కొత్త పదార్థంకాదు. సిగ్గుపడవలసింది అంతకంటే కాదు—కేవలం అందులో కత్తిఉంటే తప్ప! కాని మూర్ఖత్వం విడిచిపెట్టి దృక్పథం విశాలంగా చేసుకో గలిగితేగాని ఏ మానవుడూ కూడా ప్రేమ విలువ తెలుసుకోలేడు, ఉడుక్కోకుమరి!"

శాంత నిజంగా ఉడుక్కుంది.

"సూక్తులు విసరడానికి నీ కే చాతుర్యం ఉందనుకోకు, నేనూ సూక్తులు విసరగలను, బహుశా నీ తప్పు సూక్తులకంటె మంచివే చెప్పగలను,—నేను ప్రేమలో పడ్డానని నువ్వనుకొంటున్నావు. కాని నన్నుగురించి నాకు తెలిసినంత నీ కెన్నడూ తెలియదు, నీ పని కేవలం ఊహించడమే. అందులో నీ ఊహ తప్పు...."

అని ఏమో చెప్పబోతూ ఉంది.

ఇంతలో శ్యామల అందుకొని "—నువ్వు అంటుండే దానికే, ఆత్మవంచన అని, దాన్లో పడ్డావు. కాని నువ్వు ప్రేమ అనే దానికి ఒక సంకుచితమైన భావంతో అర్థం తీసుకుని దాని

వైశాల్యాన్ని గుర్తించలేకుండా వున్నావు ప్రేమ వైశాల్యం చాలా ఎక్కువ. ఈ ప్రపంచంలో ప్రేమకోసం ఒక నిర్ణీతమైన నిబంధనల ననుసరించి నడుచుకో నక్కరలేదు; ఒక నిర్ణీత పదజాలాన్ని మాత్రమే జపిస్తూ కూచో నక్కరలేదు. వాస్తవిక, దైనిక జీవితంలో ఉంది ప్రేమ. కాని ఒక బిగువైన గొలుసులేక చాలా వొదులుగా వుంది. అదలా వున్నట్టు చాలామందికి తెలియదు. కావలస్తే ఒక ఉదాహరణ చూడు, ప్రేమ కథలు జరగడానికి అన్నిటికంటే ఎక్కువ కాలం తీసుకుంటుంది. అంటే ఏమిటన్నమాట - ప్రేమ అనేది చాలా వొదులుగా వుందన్నమాట. నువు బిగువుగా వున్నదాన్నే వేగం కనిపెట్ట గలుగుతున్నావు గనక నీకు ప్రేమ అథ వాస్తవికంగానూ, అభూత కల్పనగానూ కనిపిస్తోంది," అన్నది.

అన్నిమాటలూ శాంతకి అర్థమయాయి. నిజమేనేమో అనే అనుమానం కలిగింది. కాని ముఖాన్ని అదోలా పెట్టుకుని "బావున్నావ్‌లే" అంది.

శ్యామల "ఆహా, అలాగా!." అని బిగ్గరగా నవ్వసాగింది.

*　　*　　*

శాంత బలమైన మనస్సు గలదని నేను చెప్పడంలేదు. కాని ఈ ప్రపంచంలో కొందరు బలమైన మనస్సు కలిగీకూడా, ప్రకృతి సిద్ధాంతాల్ని, తమ విషయంలో అన్వయిస్తే నిజమనీ, లేకపోతే అబద్ధమనీ అనుకుంటారు. ఈ తరగతికి చెందుతుంది ఆమె.

అందుకనే, మరికొన్నాళ్లు గడిచేక ఆమె అన్నది, "నిజమే. ఈ ప్రపంచంలో ప్రేమ అనేది మానవాతీతం కాదు. ఏదో పెద్ద నిబంధనలను ననుసరించుతున్నవాళ్ళే ప్రేమికులనడం కూడా తప్పే. కాని ఏ విషయంయొక్క స్వేచ్ఛతనీ నిజస్వరూపాన్నీ ద్వేషించి కనుక్కోలేము; హిరణ్యకశిపుడు ద్వేషించి విష్ణుస్వరూపాన్ని కనిపెట్ట లేనట్లు. నయాన్న విషం తాగించొచ్చుగాని, భయాన్న పాలు తాగించలేమని అంటారుగా! అంచేతనే పూర్వం "ప్రేమ"ని నమ్మలేదు."

శ్యామల ఈ మార్పుకి చాల సంతోషించింది. కాని "ఏ సుభాషితానికైనా రెండు రీతులున్నయి. సుభాషితానికి వ్యతిరేక మనుకుంటున్నది కూడా నిజం కావచ్చు. ఏ విషయం తాలూకైనా నిజస్వరూపం తెలుసుకోవాలంటే ముందా విషయాన్ని ప్రేమించా లన్నావు; కాని ద్వేషించి కూడా కనుక్కోవచ్చు. నాస్తికత్వంద్వారా దేవుడి



రాబర్ట్ పెన్ వారెన్. అమెరికాలో ప్రఖ్యాత నవలా రచయిత. ఈయన రచనలో ఉత్తమమైనది. 'ఆల్ ది కింగ్స్ మేన్' అనే నవల, దీన్నే ఒక చలన చిత్రంగా తీశారు. ఈ చిత్రం ఎకాడమీ ఎవార్డు పొందింది. ఇటీవల వారెన్ అమెరికాలో నేషనల్ ఇనిస్టిట్యూట్ అఫ్ ఆర్ట్స అండ్ లెటర్స్‌కు సభ్యుడుగా ఎన్నుకోబడ్డాడు.

స్వరూపాన్ని తెలుసుకున్నవా ళ్లన్నారుగా !— అంతేగాదు. నీ విషయంగూడా అలాగే అయింది. ప్రేమని ద్వేషించబట్టిగద, నీ కివాళ ప్రేమ స్వరూపం తెలిసింది ! అందుచేత అటూ ఇటూ కూడా వుంది !" అన్నది ఆమె.

శాంత కొంతసేపు వాదించగలదు. కాని వాదించ దల్చుకోలేదు. అందుకని వూరుకుంది.

* * *

ప్రేమ అయిన శాంత తన ప్రేమని జయప్రదం చేయడానికి ఎందుకు ప్రయత్నించలేదూ అని శ్యామల ఆశ్చర్యపడ్డది. నిజానికి శ్యామల మాత్రమే కాదు. ఆమె సిద్ధాంతం మారిపోయిందని తెలుసుకున్న ప్రతివారూ ఆశ్చర్యపడవలసిన విషయమే అది.

శాంతకి తన ప్రేమగురించి విశ్వేశ్వరరావుతో చెప్పుకోకపోవడం విచిత్రంగా కనుపించలేదు. విశ్వేశ్వరరావు తనని ప్రేమిస్తున్నాడని ఆమెకు తెలియదు కొంత తెలిసినా అది సాధికారంగా తెలిస్తేగాని తనంతట తాను చెప్పుకునే స్థితిలో లేదు. సిద్ధాంతం పోయినంత మాత్రంలో ఒక వ్యక్తి సిగ్గుపో నక్కర్లేదు. ఆమె అలా ఊరుకుంది పోయింది. చూస్తూ చూస్తూ ఉండగానే అతను పల్లెటూళ్ళో తన మేనమామ అల్లుడై పోయాడు.

వివాహానికి ముందైనా తన దగ్గిరికొచ్చి నాలుగు మాటలు చెప్పకపోవడంలో విశ్వేశ్వరరావు కొంత అన్యాయం చేశాడనుకుంది శాంత. కాని త్వరలోనే ఆమె తను కావించుకున్న ఆత్మవంచననుకూడా గుర్తించుకుంది.

కాని ఈ సంగతి ఆమెకు అట్టేసేపు జ్ఞప్తిలో లేదు. "నేను మాత్రం అతన్ని ప్రేమించానా?" అని ఆమె చాలసార్లు అనుకుంది.

ఒకసారి శ్యామలతో "లేదక్కా ! నే నతన్ని ప్రేమించ లేదు, కేవలం మిధ్యతో రాజీ పడ్డాను. ఈ ప్రపంచంలో మిథ్యతో రాజీపడడం వల్ల మానవుడు చాలా నష్టం పొందుతున్నాడు. నాకు ప్రాణాధికమైన నా సిద్ధాంతం నష్టమై పోయింది.—నిజానికి ప్రపంచంలో ప్రేమ అనేది ఎక్కడుంది? లేకపోగా అది ఒక మానవుణ్ని మరొక మానవుడు మోసం చెయ్యడానికి ఉపయోగపడుతున్న పదంమాత్ర మైంది. నువ్వు నన్ను చూసి జాలిపడుతున్న ట్టున్నావు. కాని జాలి బాధితులకీ అతి పవిత్రులకీ ఇవ్వడానికి దాచు. నేను బాధితురాల్ని కాదు. పవిత్రురాల్ని కాదు. నా సిద్ధాంతం తాత్కాలికంగా పోయినా నేను మళ్లా దాన్ని తెచ్చుకున్నాను ... పవిత్రురాల్ని కాక పోవడం ఎలాగ—ఈ ప్రపంచంలో పవిత్ర ప్రేమ లేదు. పవిత్రప్రేమ మానవుల జగత్తులోది కాదు." అన్నది

"అవే, ఆ పాతమాటలే !" అన్నది శ్యామల.

"అవునవేకాని ఎంఫసిస్ మారింది. అప్పుడు కేవలం స్పెక్యులేషన్ మీది మాటలు; ఇప్పటివి ఇచ్చితమైన, అనుభవ పూర్వకమైన మాటలు."

